ఆహారం, విశ్వాసం, స్వాతంత్ర్యం

మన ఆహార అలవాట్లు, ఆహారస్వేచ్ఛలు పాలకపార్టీ, వారి నిఘాశక్తుల వత్తిడిక్రిందకు రావటం పెరుగుతోంది. ఆహారాన్ని కూడా వీరు రాజకీయంగా తలపడే మరొక అంశంగా మారుస్తున్నారు. ఆహారం, వంటగదులు యుద్ధ రంగాలుగా మారుతున్నాయి. బిజెపి పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు హిందూపండుగల సందర్భంగా మాంసదుకాణాలను మూసివేయించటం, హిందూ ముస్లిములలో ఎవరు షాపులు నడుపుతున్నా, కాషాయదళాలు ఈ షాపులపై దాడులు సాగించటం జరుగుతోంది. మాంసానికి వ్యతిరేకంగా, ఆవుమాంసాన్ని లక్ష్యంగా చేసుకొని సంఘపరివారం ప్రచారం సాగించటం ప్రారంభించి, కబేళాలకు ఆవులను తరలిస్తూ కనిపించిన ముస్లిమ్ వ్యాపారస్తులపై దాడులకు పాల్పడుతున్నారు. ఆ తర్వాత వారు చికెన్, మటన్‌లతో సహా అన్నిరకాల మాంసాలపై నిషేధాన్ని డిమాండ్ చేశారు. ఇప్పుడు చేపకూడా వీరి వలలో చిక్కుకుంది. ప్రధానంగా బెంగాలీ ప్రాంతవాసులుండే న్యూఢిల్లీలోని చిత్తరంజన్ పార్క్ ప్రాంతంలో, ఒక కాళీమాత దేవాలయం దగ్గరలో మాంసాహార పదార్థాలను విక్రయించే చేపల దుకాణదారులను వారు బెదిరింపుకు గురిచేశారు. ఈ నిఘాశక్తులు, ఎక్కువభాగం హిందీ-హిందూ ప్రధాన భూభాగానికి చెందిన వారై వుండి, అధిక భాగం అరకొరా చదువుకున్నవారుగా వుండి, అనాదిగా బెంగాలీలకు ప్రధాన భోజనాహారంగా చేప వారి వంట సాంప్రదాయాలలో కీలకభాగంగా వుంటూవస్తోందన్న, గొప్పకూరలుగా వండుతారన్న అంశాన్ని గుర్తించటంలో విఫలమౌతున్నారు. ఇదే నిఘాశక్తులకు, హిందూత్వ విలువలను ఎత్తిపడు తున్నామని ప్రకటించుకుంటున్న వారికి, జంతు బలి ప్రత్యేకించి మేకల బలితో కూడుకున్న ఆచార తంతులతో బెంగాలీలు కాళీదేవిని కొలుస్తారనే విషయం తెలియకపోవడం, విచారకరం.

పురాతన మనస్మృతి గ్రంథం నిర్వచించిన ప్రముఖ బోధనలను, హిందూవాద 'మాంసాహారం భుజించటం' వుల్లంఘిస్తోందనే మూల ప్రకటనతో సంఘపరివారం, ఏకరూప శాకాహార భోజనమనే అంశాన్ని ముందుకు తోస్తోంది. క్రీ.శ. మొదటి, రెండు శతాబ్దాల కాలంలో రచించిన మనుస్మృతి, ఆహారాన్ని తీసుకునే సూత్రాలతో సహా సామాజిక నడవడిక, కఠిన స్మృతిని ఏర్పాటుచేసింది. ఈనాడు తమ చర్యల సమర్థనకు ఎవరైతే తరచూ మనుస్మృతిని ముందుకు తెస్తున్నారో, ఆ పాలక కులీనులు, శాకాహారాన్ని ప్రోత్సహించటానికి ఈ పురాతన సూత్రాలను పేర్కొంటున్నారు. ఏమైనా, మనం మనుస్మృతి నొక్కసారి చూస్తే, అందులో ఎక్కడా మాంసాహారం తీసుకోవటాన్ని ఖచ్చితంగా నిషేధించినట్లుగా మనం చూడం. వాస్తవానికి, మాంసం భుజించటం పాపంకాదనే భావనకు కొన్ని శ్లోకాలు మద్దతునిస్తున్నాయి కూడా. తినేవాడూ, తింటున్న ఆహారం రెండూ కూడా దైవ సృష్టిగా అందులో పేర్కొన్నారు. ఈ వైరుధ్యం ఒక ప్రశ్నను లేవనెత్తుతోంది. వారు అనుసరిస్తున్నామన్న మనుస్మృతి కూడా ఇలాంటి తీవ్రమైన వైఖరికి ఎలాంటి మద్దతునివ్వకపోయినా, ఆర్ఎస్ఎస్ నాయకత్వం ప్రత్యేకించి మోహన్ భగవత్‌లాంటి నాయకులు, మనుస్మృతి అన్వయింపులను అమలు చేయాలనుకునే ముందుగా దాని జటిలతను పూర్తిగా అర్థం చేసుకున్నారా లేదా అనేది పరిగణలోకి తీసుకోవాలి.

మాంసాన్ని నిషేధించే, శాఖాహారాన్ని రుద్దే సంఘపరివార్ ప్రయత్నాలు సాంస్కృతిక భారం మోపటాన్ని దాటి వున్నాయి. ఇవి భారత రాజ్యాంగం గ్యారంటీ కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నాయి. దక్షిణ, ఈశాన్య, తూర్పు భారతదేశ ప్రాంతాల్లో అలాగే పట్టణ కేంద్రాల్లో కోట్లాదిమంది ప్రజానీకం మాంసాహారం తమ సాంస్కృతిక గుర్తింపులో భాగంగా రోజువారీ పోషకాలకు దానిపై ఆధారపడి వున్నారు. అస్సాం, బెంగాల్, కేరళ వంటి ప్రాంతాలలో మటన్, చికెన్, చేప వంటివి స్థానిక వంటశాలల్లో సమగ్ర భాగంగా వుండి, ఈలాంటి ప్రయత్నాలు వ్యక్తిగత ఆహార ప్రాధామ్యాలను మాత్రమేగాక అనేకమంది జీవనాధారాలను కూడా దెబ్బతీసే ప్రయత్నాలుగా వున్నాయి. ఏకీకృత ఆహారాన్ని రుద్దటమంటే, తమ సంస్కృతీ సాంప్రదాయాల ప్రకారం జీవించే ప్రజల స్వేచ్ఛను నేరుగా అతిక్రమించటమే. ఆహారం, ఆచారాలు, మతపరమైన ఆచరణలలో బహుళత్వపు లక్షణాన్ని భారతసమాజం ఎల్లవేళలా కలిగివున్న భిన్నత్వాన్ని సంఘపరివారపు ఎజెండా గుర్తించదు. మాంసాహార దుకాణాలపై దాడులు, కేవలం

ఆహారస్వేచ్ఛపై జరిగిన దాడులు మాత్రమే కావు; ప్రజలు ఎలా జీవించాలో, ఎలా తినాలో, ఎలా తమ గుర్తింపులను వ్యక్తీకరించాలో అనే వాటిని అదుపు చేసి, వాటిని స్థిరీకరించే విశాల ప్రయత్నంలో ఇవి భాగం.

ఈ ప్రచారాలు ఇలా వుండగా, అత్యధిక భారతీయులు మాంసాహారులు అనేది వాస్తవం. జనాభాలో గణనీయ భాగం ప్రత్యేకించి బెంగాల్, కేరళ, అస్సామ్, ఈశాన్య ప్రాంత రాష్ట్రాలు మొదలుగు ప్రాంతాలలో ఎక్కువగా మాంసాహారం పైనే ఆధారపడతారని జనాభా లెక్కలు, సర్వే నివేదికల సమాచారం తెలుపుతోంది. కేవలం రాజస్థాన్, గుజరాత్, పంజాబ్ వంటి కొన్ని రాష్ట్రాలలో శాఖాహారం తీసుకునే వారి సంఖ్య అధికంగా వుండగా, దేశంలో ఇతర భాగమంతా ప్రధానంగా మాంసాహారం భోజనాన్నే తీసుకునేవారుగా వున్నారు. హిందువులందరికీ శాఖహారమే స్థిరమైనదిగా ప్రకటించే కథనాల కనుగుణంగా జనాభాపరమైన ఈ వాస్తవాలను చూడనిరాకరిస్తున్నారు. హరిద్వార్, వారణాసి, అయోధ్య మొదలైన నగరాలలో మాంసం, చేపల అమ్మకాలను నిషేధించే వైపుగా, మరికొన్ని రాష్ట్రాలలో మధ్యాహ్న భోజనం నుండి కోడిగుడ్లను తొలగించే వైపుగా, చట్టాలు చేయటానికి ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలను సంఘ్ పరివారపు సిద్ధాంతం నెట్టింది. ఇలాంటి చట్టాలు స్వేచ్ఛగా జీవించే హక్కును స్పష్టంగా ఉల్లంఘించటంతోపాటు, తమకు కావలసిన ఆహారాన్ని ఎంచుకునే ప్రజల స్వేచ్ఛను రాజకీయ, మతపరమైన వివాదంగా మరల్చటం కూడా. మాంసాహారానికి వ్యతిరేక పోరాటం, మనం ఏమితినాలో, ఎలా జీవించాలో, ఎవరిలాగా ఉండాలి అనేవానితో సహా, రోజువారీ జీవితంలోని ప్రతి అంశాన్నీ అదుపుజేసే విశాల ఎజెండాలో భాగమని గమనించాలి. ఈ ప్రచారాన్ని ప్రతిఘటించకపోతే, మన సాంస్కృతిక భిన్నత్వాన్ని అది ప్రమాదంలో పడేయటమేగాక, మన రాజ్యాంగబద్ధ హక్కులను సైతం తుడిచిపెట్టి, స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు, భిన్నత్వాల స్థానంలో అసహనం, అదుపుచేయటం వచ్చి కూర్చొనే సమాజానికి దగ్గరగా మనలను నెడుతుంది.

(2025 మే 'క్లాస్ స్ట్రగుల్' నుండి అనువాదం)

****